


# పురుషులందు...

## డి.కామేశ్వరి

(బ్రౌన్ అకాడమీ - నవంబర్ 2011)

"బాబూ మన విశ్వనాథం బాబుగారు పోయారటండీ, మీరలా వెళ్ళగానే ఫోనొచ్చింది.”

ఉదయం వాకింగ్ నించి రాగానే వంటావిడ కాంతమ్మ చెప్పిన కబురువిని, ఎదురు చూసిందే అయినా ఒక్క క్షణం అలా వుండిపోయారు క్రిష్ణమూర్తిగారు.

“ఎప్పుడు.. ఎప్పుడు పోయారుట? నాకు ఫోను చేసి చెప్పకపోయారా, అట్నించి అలాగే వెళ్ళివచ్చేవాడిని గదా” బూట్లు విప్పుకుంటూ అన్నారాయన.

“మీ సెల్ ఫోన్ ఇంట్లోనే వదిలివెళ్ళారు బాబూ...”

"సరే, కాఫీ ఇవ్వండి. అలా వెళ్ళి వస్తాను. దహన కార్యక్రమం ఎప్పుడు చేస్తారో మరి" అంటూ లోపలికి వెళ్ళి వాకింగ్ డ్రస్ మార్చుకుని, కాఫీ త్రాగి బయలుదేరారాయన.

విశ్వనాథంగారిల్లు చేరేసరికి, ఇంటిముందు, ఇంట్లో, మెట్లమీద, వరండాల్లో చుట్టాలు, స్నేహితులు అపార్ట్‌మెంట్ ఇరుగుపొరుగు అంతా నిల్చుని కొందరు, గుమ్మం ముందు వేసిన కుర్చీల్లో కొందరు మగాళ్ళు, ఆడవాళ్ళంతా లోపల గదుల్లో నిండివున్నారు. క్రిష్ణమూర్తి రాగానే వెంకటేశ్వరరావు, రామారావు, చలపతి రోజూ వాక్ చేసే గ్రూపు ముందుకు వచ్చి “కబురు తెలిసి మేమూ ఇప్పుడే వచ్చాం. దాటిపోయాడు. సుఖపడ్డాడు” అన్నారు లోగొంతుకతో.

“గత మూడునెలలుగా నరకం అనుభవించాడు పాపం. ఇంట్లో వాళ్ళు సరే. ఏదో విముక్తి లభించింది” అన్నారు రామారావుగారు.

కృష్ణమూర్తిగారు తలాడించి “పాపం శారదమ్మగారిదే బాధ, ఆవిడని తల్చుకుంటే ఇకముందు...” అంటూ లోపల్నించి వాసు రావడం చూసి ఆపేసి కాస్త ముందుకెళ్ళి అతని భుజం మీద చెయ్యి ఆంచి ఓదార్పుగా “సారీ వాసూ ఇప్పుడే తెలిసింది కబురు. ఎన్నిగంటలకి పోయారు నాన్నగారు “ అన్నారు.

"తెలియదు అంకుల్. నిద్రలోనే ప్రాణం పోయింది. తెల్లారి అమ్మలేచి చూస్తే ఏదో తేడా కనిపించి పిలిచింది. వెళ్ళేసరికి అర్ధం అయింది " కాస్త విచారంగా  అన్నాడు.

"ఏదో ఆ ప్రాణానికి ముక్తి దొరికిందని సంతోషించాలి. మంచాన కోమాలో వుండి ఎన్నాళ్ళుండి ఏం లాభం. భుజం తడ్తూ ఇక ముందు జరగాల్సినవి చూడు బాబూ? మీ అక్కలిద్దరూ వచ్చారా?"

"పెద్దక్కముందే వచ్చివుంది. చిన్నక్క టాక్సీలో బయలుదేరింది. రెండుగంటల్లో వచ్చేస్తుంది. పదకొండు గంటలకి కార్యక్రమం పూర్తిచేస్తాం" వాసు చెప్పి లోపలికి వెళ్ళాడు.

"లోపలికి వెళ్ళి ఆవిడని చూసొచ్చేశారా మీరు?" క్రిష్ణమూర్తి అడిగారు.

"ఏదీ మేమూ ఇప్పుడే వచ్చాం. లోపలంతా ఆడవాళ్ళు ఉన్నారు. మనం వెడితే బాగుంటుందా యిప్పుడు" వెంకటేశ్వరరావు అన్నారు.

“బాగుండడానికేముంది. సానుభూతి చూపాల్సింది ఆవిడకేగదా, గత పదేళ్ళుగా  పరిచయం. పదండి ఆవిడని పలకరించి వద్దాం.”

నలుగురూ లేచి లోపలికి నడిచారు. ఆడవాళ్ళు కాస్త తప్పుకుని దారి ఇచ్చారు. ముందు గదిలో నేలమీద శవాన్ని పడుకోబెట్టారు. తల దగ్గిర దీపం ప్రమిద. పక్కన తులసిచెట్టు. సన్నగా టేప్‌రికార్డర్‌లోంచి భగవద్గీత వినిపిస్తోంది. ఆగదికి ఆనుకుని ఉన్న పక్కగదిలో గోడకానుకుని శారదమ్మ శోకదేవతలా కూర్చుంది. అసలే బక్కపలచని మనిషి. గత మూడు నెలలుగా భర్త సేవలో, మానసిక దిగులుతో మరింత చిక్కి శల్యంగా బుగ్గలు, కళ్ళు లోతుకుపోయి ఏడ్చి వాచిన కళ్ళతోవున్న ఆవిడని చూసి నలుగురూ నమస్కరించారు. వాళ్ళని చూచిన ఆవిడ కళ్ళు మళ్ళీ నిండాయి.

"మీరింక బాధపకూడదు. నరకం నించి ఆయనకి విముక్తి కలిగిందని సంతోషించాలి" కృష్ణమూర్తి ఓదార్పుగా అన్నారు.

ఆవిడ రెండు చేతులు జోడించి కనపడని దేముడికో, దేముడు దగ్గరికి పోయిన మనిషికో, పలకరిస్తున్న మిత్రులకి ఓ నమస్కారం పెట్టి “ఆయనకి విముక్తి దొరికింది. నా సంగతేం చేసి పోయారు” అంటూ చీరకొంగుతో మొహం కప్పుకుంది ఆవిడ.

“ఊరుకోమ్మా – ఎంత ఏడిస్తే ఏం లాభం” తల్లి భుజం పట్టుకు ఓదార్చింది కవిత.

పక్కనే నిలబడ్డ కోడలు ఓ చూపు విసరి లోపలికి వెళ్ళిపోవడం క్రిష్ణమూర్తిగారి దృష్టిని దాటిపోలేదు.

"ఇంకో కూతురు రావాలి. పదకొండుకి మళ్ళీ వద్దాం. ఇక్కడ కూర్చుని చేసేదేంవుంది. వచ్చేవాళ్ళకి బంధువులకి కాస్త చోటుంటుంది కూర్చోడానికి" నలుగురు మిత్రులు కూడబలుక్కుని బయటికి వెళ్ళారు. ఈ అపార్టుమెంటు జీవితాల్లో శుభానికి, అశుభానికి నలుగురు వస్తే నిలబడే చోటుండదు.

❦❦❦

పదేళ్ళుగా ఐదుగురు కూర్చునే ఆ పార్కులో బెంచిపై నలుగురే కూర్చోడం అలవాటవడానికి కొన్ని రోజులు పట్టింది.

"పంచపాండవులనేవారు మనల్ని. అందరిలోకి చిన్నవాడు ముందెళ్ళిపోయాడు" చలపతి విచారంగా అన్నారు.

"ఇంక ఒక్కొక్కరం మూటముల్లె సర్దుకోవడం మొదలు పెట్టే సమయం వచ్చినట్లనిపిస్తూంది" రామారావు నవ్వి అన్నారు.

"ఒక్కొక్కరం ఈ బెంచిమీద కూర్చుని మాటలు కలిపి, పరిచయాలు పెంచుకుని, ఆత్మీయతలు పెనవేసుకున్నాయి తెలియకుండానే. ఎన్ని కబుర్లు, రాజకీయాలు, ఉద్యోగాలు, రిటైర్మెంటులు, పిల్లల చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు, మనవలు – అమెరికా ప్రయాణాలు – పాత సినిమాలు, పాత పాటలు, పాత నవలలు, రోజుకొకరం కంపల్సరీగా ఒక జోకు చెప్పాలనే నిబంధన. వాకింగ్ అరగంట. బాతాఖాని గంట. ఎంత దగ్గరయిపోయాం అందరం" క్రిష్ణమూర్తి అన్నారు నిర్వేదంగా.

"మన ఊర్లు వేరు, ఉద్యోగాలు వేరు. ఎక్కడెక్కడనించో వచ్చి ఈ నేలను అపార్ట్‌మెంటు కొనుక్కోవడం – ఈ పార్కు బెంచి మనల్ని యిలా స్నేహితులని చేయడం విచిత్రంగా అనిపిస్తుంది ఆలోచిస్తే" సాలోచనగా అన్నారు జస్టిస్ చలపతిరావు.

"మన సమస్యలు, బాధలు, సంతోషాలు అన్నీ అందరం మనసు విప్పి చెప్పుకునేంత దగ్గరయ్యాం ఆశ్చర్యంగా – నిజం చెప్పాలంటే మన నలుగురికి పెద్ద సమస్యలే లేవు. పిల్లలు దగ్గరలేరన్న బాధ తప్ప" డి.ఐ.జి రామారావు అన్నాడు.

"పాపం అదే అనేవాడు విశ్వనాథం. పిల్లలు దగ్గరలేరని బాధపడ్తుంటే పిల్లాడి దగ్గర వున్నానే అని నే బాధపడ్తున్నా. . విచిత్రంగాదూ అనేవాడు" లాయరు వెంకటేశ్వరరావు అన్నారు.

"ఏమిటో పాపం. మీరంతా ఎంత అదృష్టవంతులు నెల తిరిగేసరికి పదిహేను, ఇరవై, పాతికవేలు పెన్షన్లు వచ్చి పడ్తాయి. నిజంగా గవర్నమెంటు ఉద్యోగంలో  వున్న సుఖం దేన్లో లేదయ్యా. భవిష్యత్తుకి చీకూ చింతా వుండదు. ప్రైవేటు ఉద్యోగాలేముందు డబ్బు దులిపి చేతిలోపెట్టి పొమ్మంటాయి అనేవాడు" ఛీఫ్ ఇంజనీరు క్రిష్ణమూర్తి అన్నారు.

"నిజమే మరి. ఉద్యోగంలో ఉండగా ప్రైవేటు ఉద్యోగాలంత జీతాలుండకపోయినా రిటైరయ్యాక దిగులుండదు కదా. అయినా పాపం వెర్రివాడు. ప్రావిడెంటు ఫండంతా కొడుకు చేతిలో పెడ్తారా ఎవరన్నా.. ఈ రోజుల్లోనూ ఇంత తెలివితక్కువ తనం?"

"ఏం చేస్తాడు పాపం పరిస్థితులలా వచ్చాయి. ముందే సగం డబ్బు ఆడపిల్లల పెళ్ళికి అప్పు తీసుకున్నాడు. తండ్రిపోయిన సంసారంలో కొడుకు బాధ్యతలు తీరేసరికి తండ్రిగా బాధ్యతలు వచ్చిపడ్డాయి. చేతికి వచ్చిన పన్నెండు

లక్షలన్నా దాచుకొలేకపోయాడు. మూడు బెడ్‌రూములు ఇల్లు కొనుక్కుందాం నాన్నా మీకూ ఖర్చు కలిసివస్తుంది. బ్యాంక్ లోను ఇస్తుంది. ఒకవంతు మనం కట్టాలి అంటే నమ్మాడు. ఏదోఖర్చులకని మూడు లక్షలుంచుకుని మిగతాది అపార్ట్‌మెంటూ కట్టడానికి ఇచ్చేసాడు " క్రిష్ణమూర్తి విచారంగా అన్నారు.

"ఈ రోజుల్లో ఇంత అమాయకత ఏమిటో, ఏం ఇచ్చినా మన తదనంతరం అని రాసుకోవాలి ముందే ఇస్తే రోగం రొస్టు వస్తే మనకెవరిస్తారు?"

"విశ్వనాథాన్ని చూసన్నా మనం ఇంక కాస్త తెలివి తెచ్చుకోవాలి. డబ్బంతా లాక్కుని వూరికే ఇంట్లో తిని కూర్చున్నట్టు కొడుకు కోడలు సాధిస్తూంటే పాపం భరించలేకపోయేవాడు. తన కన్నా తన భార్య ఇంట్లో వంటమనిషి, పనిమనిషి అయిపోయిందని దిగులు పడేవాడు. అభిమానం ప్రేమ, గౌరవం చూపితే చాకిరి కష్టం అనిపించదు అనేవాడు. ఎంత వద్దనుకున్నా ఇంటి విషయాలు చెప్పకుండా వుండలేకపోయేవాడు మాటల మధ్య."

"దానికి తగ్గట్టు అతనికి, ఆవిడకి బ్లడ్ ప్రషరు, షుగరు – మందులు మాకులకు ఆ వడ్డీ సరిపోయేది కాదు. ఊరికే తిండి పెడ్తున్నట్టు కోడలి మాటలు.."

"పాపం ఆ యిల్లాలిని చూస్తే జాలేసేది. ఎప్పుడన్నా పక్క అపార్ట్‌మెంట్ అని ఏ ఆదివారమో వెడ్తే ఆ ఇల్లాలి చాకిరి, ఆ పీక్కుపోయిన మొహం. జాలేసేది క్రిష్ణమూర్తి ఆవేదనగా అన్నారు.

"రోగాన పడ్డాక పరిస్థితి మరింత దిగజారిపోయింది. మహా మహా వాళ్ళే తట్టుకోలేరు ఆస్పత్రి ఖర్చులు. ఒకసారి స్ట్రోకు, ఓసారి హార్ట్ అటాక్ – ఆఖరికి కోమాలోకి వెళ్ళిపోయాడు. చేతిలో ఉన్న ఆ కాస్త డబ్బు హరించిపోయింది. ప్చ్.. పాపం ఇంక ఆ యిల్లాలు పర్మనెంట్ పనిమనిషే ఆ ఇంట్లో "మిత్రులంతా కొన్నాళ్ళు పోయిన విశ్వనాథాన్ని, బతికుండి బాధలనుభవిస్తున్న శారదమ్మని చూసి జాలిపడేవారు అంతకంటె చేసేదేంలేక.

ఏడాది గడిచింది. సంవత్సరీకాలు పూర్తి అయ్యాయి. ఏదో లోకం కోసం అయిందనిపించినట్టు పూర్తిచేశాడు కొడుకు. మిత్రులు నలుగురు ఫోంచేసి శారదమ్మను చూసి పలకరించి వచ్చారు. కళావిహీనంగా ఉన్న ఆమె మొహం, చిక్కిన ఆమె శరీరం, ఆ కళ్ళలో దైన్యం. అందరిని కలచివేసింది. మాట్లాడుకోడానికి ఏం లేనట్టు ఆ రోజు బెంచిమీద కూర్చుని మౌనం దాల్చారు.

గేటు తీసుకుని విసురుగా వచ్చిన వాసు వరండాలో వాలుకుర్చీలో పేపరూ చదువుతున్న క్రిష్ణమూర్తిని చూసి కఠినంగా, విసురుగా, "మా అమ్మ ఎక్కడ? పిలవండి" దురుసుగా అన్నాడు.

క్రిష్ణమూర్తి పేపరులోంచి తలెత్తి "లోపలున్నారు వెళ్ళి మాట్లాడవచ్చు " ప్రశాంతంగా అన్నారు.

"అక్కరలేదు – పిలవండి ఇక్కడికి. ఇక్కడే తేల్చేస్తాను. ఇలాంటి ఇంట్లో అడుగు పెట్టాల్సిన అవసరంలేదు నాకు. పిలవండి.." అరిచాడు ఆవేశంగా.

"ఏం మాట్లాడదలిచావో చెప్పు వింటాను" శారదమ్మ లోపల్నించి వచ్చి గుమ్మం దగ్గర నిల్చుని కొడుకు వంక చూస్తూ అంది. తల్లివంక తిరస్కారంగా చూసి "నా తల్లి ఇంత బరితెగిస్తుందని, పరువు మర్యాద, మానాభిమానాలు అన్నీ వదిలి ఇలా పరాయి మగాడి ఇంట పడివుండడానికి తయారయిందని విని నా తల ఎక్కడ పెట్టుకోవాలో తెలియలేదు. నీవెలాగు పరువు, సిగ్గు వదిలావు. నీ పిల్లల సంగతన్నా గుర్తురాలేదా? మేము తలెత్తుకు తిరగాలనుకున్నావా? వద్దా. ఐదు రోజులుగా ఇంట్లో నీవు కనపడక ఏమయిపోయావు, ఎక్కడికి పోయావో అర్ధంకాక ప్రతివాళ్ళని అడిగి ఆరా తీసి పోలీసు కంప్లైంట్ కూడా ఇచ్చాను. బాబిగాడు నిన్న సాయంత్రం రోడ్డు మీద సైకిలు తొక్కుతుంటే నీవు కనబడ్డావుట. మామ్మా అని పిలుస్తుంటే లోపలికి వెళ్ళిపోయావుట. నేను ఇంటికి వచ్చేసరికి ఆలస్యం అయి వాడు నిద్రపోయేముందు వాళ్ళ అమ్మకి చెప్పాడుట. రాత్రి నేను వచ్చాక సంధ్య చెబితే నమ్మలేక పోయాను. ఉదయమే వచ్చి చూస్తే నిజమన్నది అర్ధం అయింది. ఛా.. ఇలా చెప్పకుండా చెయ్యకుండా ఇల్లొదిలి పరాయి మగాడింట్లో అదీ ఆడవాళ్ళు లేని ఇంట్లో ఉండడానికి సిగ్గులేదా?" అరిచాడు.

"పరాయి మగాడెవరు బాబూ, నా భర్త ఇంట్లో ఉన్నాను. నేనేం పరువు తక్కువపని, తప్పుడు పని చేయలేదు నాయనా. అది అర్ధ చేసుకుని మాట్లాడితే మంచిది" కఠినంగా అంది శారదమ్మ. నిర్ఘాంతపోయాడు వాసు. నోటమాటరాక ఒక్క క్షణం అలా వుండిపోయాడు. మొహం ఎర్రబడి ఆవేశం అదుపులో పెట్టుకోలేనివాడిలా "ఏమిటి...భర్తా... ఎవరు.. ఈయనా? నీ భర్తా.. ఓ గాడ్. ఎంతకు తెగించావు. ఈ వయసులో నాన్నపోయిన ఏడాదికి పెళ్ళిచేసుకున్నావా.. ఎంత బరితెగింపు? గొప్పగా చెప్తున్నావు సిగ్గులేకుండా " అరిచాడు.

"గొంతు తగ్గించు వాసూ .ఇంకొకరింటికి వచ్చి ఇంటిముందు నిలబడి అరవడం మర్యాదకాదు" హెచ్చరికగా అంది శారదమ్మ. జరుగుతున్న దానితో సంబంధం లేనివాడిలా, తల్లి కొడుకులు చూసుకుంటారన్నట్టు నిర్లిప్తంగా పేపరు చదువుకుంటున్న క్రిష్ణమూర్తిని చూసేసరికి తిక్క తిరిగింది.

"ఏం పెద్దమనుషులండీ మీరు. ఛీ...ఛీ....స్నేహితుడి భార్యని, అదీ భర్తపోయి ఏడాది దాటగానే పెళ్ళిచేసుకున్న మీరు.. మర్యాదస్తులనుకున్నాను ఇన్నాళ్ళు. ఇంతకి దిగజారి.. ఈ వయసులో.. ఛీ ఆవిడ బుద్ధా ఇది మీకు పుట్టిన బుద్ధా."

"వాసూ.. నీవేం అనదలిచినా నాతో మాట్లాడు. ఆయన్ని ఒక్క మాటంటే ఊరుకోను.." స్థిరంగా అంది శారదమ్మ.

"ఓహో కొత్తమొగుడి మీద అంత ప్రేమా! అవును కొత్త మోజుగా, ఈ వయసులో మరో మొగుడు, మగాడు కావల్సి వచ్చి ఇంతకు తెగించావన్నమాట. తల్లి అన్నది మర్చి అసహ్యంగా మాట్లాడాడు. క్రిష్ణమూర్తి సావకాశంగా పేపరు మడిచి పక్కనపెట్టి "చూడు వాసూ.. మీ అమ్మ.." ఏదో చెప్పబోయాడు.

"ఛ.. మీరు నాతో మాట్లాడకండి. పెళ్ళాం పోయి వంటరిగా వుండి, మొగుడు పోగానే మా అమ్మకి గాలం వేసారంటే" ఏహ్యంగా తిరస్కారంగా అన్నాడు.

“వాసూ నోర్మూయ్. ఈ మహానుభావుడ్ని ఒక్కమాటంటే సహించను. వెళ్ళు ముందిక్కడనించి వెళ్ళు. నేనెవరికి జవాబుదారి కాను. అవును, నా వళ్ళు కొవ్వెక్కి, మగాడు కావల్సి వచ్చి పెళ్ళి చేసుకున్నాను. సరేనా.. ఇంకవెళ్ళు. ఈ పాపిష్టిదాని మొఖం చూడకు. నే చచ్చినా నా మొహం చూడక్కరలేదు. నాకెవరూ లేరు. లేరనుకునే ఇక్కడికి వచ్చాను..” కఠినంగా అంది.

“నా కన్నతల్లి వుంది అనుకుని వచ్చాను. నీవిలాంటిదానివని తెలిస్తే ఏనాడో నీళ్ళు వదిలేసేవాడిని. ఇక నీకు నాకు ఏం సంబంధం లేదు. చచ్చిన దానితో సమానం.”

“అవునుబాబూ, నీలాంటి కొడుకులు తల్లి బతికుండగానే నీళ్ళు వదిలేస్తూ చచ్చినదానితో సమానం అనుకోబట్టే కొందరు నిర్భాగ్య తల్లులు కన్నబిడ్డల మీద మమకారం కూడా వదులుకుని ఏ అనాథ ఆశ్రమాల్లోనో చేరుతున్నారు. కన్నతల్లులు కొడుకు, కోడలు, మనవలు తన కుటుంబం అనుకుంటారు. కొడుకులు భార్యాబిడ్డలు మాత్రమే తన కుటుంబం అనుకునే పరిస్థితి వచ్చాక ఇంక ఆ తల్లి ఏం చేస్తుంది. గొడ్డుచాకిరి చేసినా ఊరికే తిని పోతుందని ఏడిచే పరిస్థితి వచ్చాక అది భరించలేని తల్లి తన దారి తను చూసుకుంటుంది.”

"అంటే, ఇంట్లో పనిపాట చేయడం గొడ్డుచాకిరా. కొడుకింట్లో వుంటూ కాస్త పనిచేయడం, మనవలని చూసుకోవడం కూడా గొడ్డు చాకిరి చేయించినట్టా ఇద్దరం ఉద్యోగం చేస్తున్నాం. తల్లివి ఆ మాత్రం ఇల్లు, పిల్లలని కనిపెట్టుకుని ఉండడం బాధలు పెట్టడమా" ఆవేశంగా అరిచాడు.

"తల్లికి పిల్లల బాధ్యత బరువుకాదు. పిల్లల బాధ్యతలు తీరిన ముదివయసులో తలకి మించిన భారాన్ని తల్లి తలకెత్తుతే మోయలేదన్నది మీకర్థంకాదు. ఇంట్లో పడి ఊరికే తింటుంది ఆ మాత్రం చెయ్యదా అని మీకనిపిస్తుంది. శక్తిని మించిన బరువు మోయడానికి కాస్తంత ప్రేమ, ఆదరణ, గౌరవం ఉంటే ఏదో విధంగా బరువులాగ్గలరు. అదీ లేనినాడు జీవచ్చవాలవుతారు. నాలా గతిలేని వాళ్ళు ఏ అనాథాశ్రమాలో వెతుక్కుంటారు. ఆస్థితి నాకు పట్టకుండా ఏ దేముడో కరుణించి ఈయన రూపంలో నన్నాదుకున్నారు. బాబూ ఈ శేషజీవితం ఈ నీడని ప్రశాంతంగా బతకనీ, ఇంక వెళ్ళు నీకు నమస్కారం" చేతులు జోడించి అంది శారదమ్మ.

“కొడుకు చూడలేదని చెప్పి నాటకాలెందుకు – డబ్బు దస్కం ఉన్న ఆయన్ని పట్టావు తెలివిగా” అక్కసుగా అన్నాడు. శారదమ్మ నవ్వింది.

“పోనీ అలాగే అనుకో..” అంది ప్రశాంతంగా

“నీ బాధ నాకర్ధం అయింది బాబూ జీతం బత్తెంలేని నమ్మకమయిన పనిమనిషి చేజారిపోతే కష్టమేమరి “ అంది గుంభనంగా. తల్లివంక కొరకొర చూసి క్రిష్ణమూర్తి వంక అసహ్యంగా చూసి విసవిస వెళ్ళిపోయాడు.

"మిమ్మల్నిద్దరిని అర్జంటుగా ఎందుకు పిలిపించానో ఈపాటికి అర్ధమై వుంటుంది .మీకు ఇక్కడ జరిగిన విషయం ఎవరినోటో  వినడం కంటే నేనే చెపితే మంచిదని పిలిచాను" క్రిష్ణమూర్తి కొడుకు విశాల్, కూతురు సుమని గదిలోకి పిలిచారు మాట్లాడడానికి.

"ఇదంతా ఏమిటి డాడి. ఈ వయసులో ఇదంతా అవసరమా మీకు. నలుగురి నోళ్ళలో పడి పరువు పోగొట్టుకోవడం,ఆవిడ కొడుకు మీ గురించి ఊరువాడ చెడు చెప్పడం. ఛా... నాకు చాలా ఎంబ్రాసింగ్‌గా అనిపించింది" విశాల్ నిష్ఠూరంగా అడిగాడు.

"డాడి మా ఆయన మీగురించి హేళనగా మాట్లాడుతుంటే తలదించుకున్నాను. డాడీ మాకు తెలుసు అమ్మపోయాక మీరు వంటరితనం ఫీలవుతున్నారు. కాని, యీ డెబ్బై ఏళ్ళ వయసులో, ఓ ముసలావిడని, అదీ ఓ స్నేహితుడి భార్యని పెళ్ళాడడం.. ఎంత చీప్‌గా ఎంత అసహ్యంగా అనిపిస్తుందో తెలుసా, మీకు తోడు అవసరం అనుకోవచ్చు. మీ పిల్లలు, మీ మనవలు సమాజం ముందు మీరు ఎంత చులకన అవుతారన్నది ఆలోచించవద్దా డాడీ. మీపట్ల వున్న గౌరవం, అభిమానం ఈ ఒక్క చర్యతో తుడిచిపెట్టుకుపోయింది “ నిష్టూరంగా, విరక్తిగా అంది సుమ మొహం చిట్లించి.

క్రిష్ణమూర్తిగారు  వారిద్దరిని వారిస్తూ “తెల్సమ్మా.. మీరంతా నాగురించి ఏం అనుకుంటారో ఊహించలేనంత వెర్రివాడిని కాను, చిన్నవాడిని కాను. ఇది నాకో ఆడతోడుకావాలనీ, ఈ వయసులో ముచ్చట్లు కావాలనీ చేసుకున్న పెళ్ళికాదు. మీ అమ్మపోయిన ఈ పదేళ్ళలో యీ వంటరితనానికి అలవాటుపడి, నాకంటూ ఓ వ్యాపకాలు, నచ్చిన కాలక్షేపాలు ఏర్పరుచుకున్నాను. కాంతమ్మగారి ధర్మామా అని ఇంట్లో తిండికేమీ ఇబ్బందిలేదు."

“మరెందుకు ఇలాంటి పనిచేసి నలుగురిచేత అనిపించుకోడం – “ కొడుకు నిలేశాడు.

ఎందుకంటే, ఆ ఇల్లాలిని ఆ నరకంలోంచి తప్పించి, ఆదుకుని, ఆదరించి ఆవిడ శేషజీవితం మనశ్శాంతిగా బతకడానికి ఓ తోవ చూపాలని...

"లోకంలో మొగుడుపోయి, ఇంతకంటే దుర్భరస్థితిలో, దారిద్ర్యంలో మగ్గుతున్న ఆడవాళ్ళు చాలామంది ఉంటారు. దానికోసం మీరు ఇలాగ నలుగురు నోళ్ళలో పడి..” మధ్యలోనే అరిచాడు కొడుకు.

"లోకందేం వుంది .నాలుగురోజు అంటుంది. అలవాటయితే వాళ్ళే నోరు మూసుకుంటారు. నిజమే లోకంలో శారదమ్మలాంటివాళ్ళు చాలామంది వుండవచ్చు. కాని నాకళ్ళముందు నాకు తెలిసిన నా స్నేహితుడి భార్య, కన్నకొడుకు ఇంట్లో హీనంగా బతుకుతూ అనాదరణకి, అవమానాలకి గురి అవుతుంటే చూసాక, ఆ దయనీయస్థితినించి తప్పించాలని,

ఆవిడకి ఓ కొత్త జీవితం, కొత్త ఆశ, బతుకుమీద అనురక్తి, శేషజీవితాన్ని ప్రశాంతత, భద్రత కల్పించాలని, ఇంకా ఆమెకి అరవైమూడేళ్ళు, ఇంక ఈ అనారోగ్య జీవితంతో, బండెడు చాకిరితో ఇంటి బాధ్యత మోస్తూ, చాకిరి చేసినా ఆదరణ, గౌరవం, అభిమానం లేనిచోట వుండి బతుకీడ్చలేదని ఆమెకి అండగా నిలవాలని ఈపనిచేశాను. మిత్రుడి ఆత్మ సంతోషించాలని.”

"ఆవిడ పరిస్థితి బాగోలేకపోతే డబ్బు సాయంచేసి ఆదుకోవచ్చు. దానికోసం పెళ్ళిచేసుకోవాలా? నలుగురి నోళ్ళలో పడాలా" కూతురు నిలేసింది.

"అవును, ఆవిడకి ఆర్థికసాయం చేయచ్చు. మందులవి కొని ఇవ్వచ్చు" కొడుకన్నాడు.

"విశాల్, నీకు లోకం సంగతి తెలియదు. ఒక అయినింటి ఆవిడ పరాయివాళ్ళనించి డబ్బు తీసుకుంటుందా? అభిమానవతి అయిన ఆమె పరిస్థితికి తలొగ్గి తలవంచినా ఆ కొడుకు, కోడలు ఇది తెలిస్తే ఆమెని బతకనిస్తారా? ఒకటి రెండుసార్లు మోయలేని బరువులతో, నడవలేక నడుస్తూ, నీరసంగా కనిపించిన ఆవిడ సంచులు ఇంటివరకు తెచ్చిపెట్టినందుకు ఆ ఇల్లాలు మొహమాటపడిపోయింది. అది చూసి కోడలు మూతి తిప్పింది. రెండు మూడుసార్లు “అమ్మా మందులు వేసుకోడంలేదా ఇలా అయిపోయారు “ అంటూ ఇంటికి వెళ్ళినపుడు పలకరిస్తే, “ఎవరికోసం బతకడానికి మందులు వేసుకోవాలి బాబూ” అంది విరక్తిగా.

“ఈ వయసులో బ్లడ్ ప్రెషరు, షుగర్ అందరికి మామూలైపోయాయి” అన్నాడు కొడుకు తేలిగ్గా.

ఓసారి దుకాణంలో కనిపిస్తే “అమ్మా, విశ్వనాథం నా స్నేహితుడు. ఎప్పుడూ మీ గురించే దిగులు పడేవాడు. మీరిలా వుంటే అతని ఆత్మక్షోభిస్తుంది. బతికినన్నాళ్ళు ఆరోగ్యం వుండాలి గదమ్మా. మంచానపడి అతనెంత నరకం అనుభవించాడో చూసారుగా. కాదనకండి ఈ మందులు వేసుకోవాలి అంటూ మందులు కొని బలవంతంగా చేతిలో పెడితే ఆవిడ పాపం ఎంత ఇబ్బందిపడిందో, ఇంటికెళ్ళాక మందులు చూసి కోడలు నిలేసిందట. ఇలాంటి పరిస్థితిలో ఆవిడని రోడ్డుమీద పలకరించినా, ఇంటికెళ్ళి సానుభూతి చూపాలన్నా, ఆర్థికంగా ఆదుకోవడం సాధ్యపడుతుందా.

"బాగుంది. ఎవరికోసమో, జాలి, సానుభూతితో ఇలంటి పనిచేసి మా అదరికి తలవంపులు కలిగించారు. మేం అందరికి ఏం సమాధానం చెప్పుకోవాలి" కూతురు తిరస్కారంగా అంది.

“ఆవిడ ఆర్థికసాయం అందుకోడానికే ఇబ్బంది పడిందేమో? మరి ఏకంగా ఈ వయసులో పెళ్ళిచేసుకోడానికి ఎలా ముందుకు వచ్చిందో మీ ఆస్తి, అంతస్తు చూసి మిగతా జీవితం సుఖంగా గడిచిపోతుందని వప్పుకుందేమో” విశాల్ హేళనగా అన్నాడు.

"హ – నాన్నగారి ఇల్లు వాకిలి, డబ్బు, స్వంతం అవుతుందిగదా పెళ్ళాడితే, ఊరికే ఏ వెయ్యో రెండువేలో పుచ్చుకుంటే ఏం లాభం. అసలుకే వేసింది పన్నాగం.." వ్యంగ్యంగా అంది.

క్రిష్ణమూర్తి ఇద్దరివంక కోపంగా చూశాడు. "దయచేసి అలా అసహ్యంగా ఆ యిల్లాలిని అవమానపరచకండి. ఇందులో ఆమె ప్రమేయం లేదు. ఆ విషయం మీకు స్పష్టంగా చెప్పడానికే పిలిచాను. ఈ ఆస్తి, ఈ ఇల్లు, నా డబ్బు దస్కం మీకు చెందాల్సినవి. నా తదనంతరం అన్నీ మీకే చెందుతాయి. ఆ విషయంలో మీకేం భయంవద్దు. నేను లేని మరుక్షణం ఆమె ఈ యింట్లో ఉండదు. నేనెన్నాళ్ళు వుంటానో నాకు తెలియదు. నా తదనంతరం ఆవిడకి దక్కేది నా పెన్షను మాత్రమే. నా తరువాత పెన్షను కేవలం భార్యకిస్తారు తప్ప పిల్లలకి ఇవ్వరుగదా. అది ఆవిడకి చెందుతుంది. ఈరోజున నాకు పాతికవేలపైన పెన్షనుంది. తరువాత అందులో సగం ఆవిడకి వెళ్తుంది. నా తరువాత ఓ ఓల్డేజ్ హోముకి ఆమె వెళ్ళి ఆ డబ్బుతో ఆవిడ సుఖంగా బతికే ఏర్పాటు చేశాను. భర్తకి పెన్షను లేని ఉద్యోగం అవడంవల్ల, తెలివితక్కువగా ఉన్న డబ్బు ముందే కొడుక్కి ఇచ్చి పూర్తిగా వాళ్ళ దయాధర్మాలమీద ఆధారపడి హీనంగా బతుకుతున్న ఆమెకి ఓ బతుకు చోటు చూపడానికే ఈ పెళ్ళి. కేవలం ఆమెకి నా పెన్షను ఇప్పించడానికే ఈ పెళ్ళి. ఆవిడ ముందు అసలు వప్పుకోలేదు. నేను నా మిత్రులు ఈ ఆలోచన చెప్పి వప్పించడానికి చాలా అవస్థపడ్డాం. ఆ నరకం నుంచి బయటపడడానికి మాకు తోచిన మార్గం ఇది. లోకం గురించి ఆలోచన వద్దు. బతికిన నాలుగురోజులు మీరు ప్రశాంతంగా బతకండి అని బలవంతంగా వప్పించాం. ఆవిడ నాకు తోబుట్టువులాంటిది. అందుకే శాస్త్రోక్తంగా ఏ గుళ్ళో పెళ్ళి కాకుండా రిజిష్టరు పెళ్ళి చేసుకున్నాం. అధికారికంగా ఈ ఇంట్లో ఆమె వుండేందుకే ఈ ఏర్పాటు. కాస్తంత ఆశ్రయం కల్పించడానికే ."

"ఇదేదో ముందే మాకు, వాళ్ళ పిల్లలకి చెపితే ఇంతగోల, అపార్థాలు వుండేవి కావుకదా" కొడుకు కాస్త చల్లపడి అన్నాడు.

"ముందు చెపితే కొడుకు అడ్డుపుల్లలు వేసేవాడు. అంతేకాక పెన్షను కోసం ఈ పెళ్ళి జరిగిందన్నది ఈ నోట ఆనోట అందరికి తెలిస్తే, మరికొందరు ఇలా చెయ్యచ్చు దీంతో ప్రభుత్వం ఇది అరికట్టడానికి ఏమన్నా కొత్త రూల్స్ పెట్టచ్చు. కేవలం పెన్షను కోసం పెళ్ళి అంటే పెన్షను నిరాకరించవచ్చు. అందుకని నేను, నా స్నేహితులు చాలా రహస్యంగా ఈ ఏర్పాటు చేసాం. ఎవరికి తెలియనివ్వకుండా. మీరు దయచేసి ఈ విషయం గురించి నోరిప్పద్దు. ఆవిడ నోటిముందు కూడు పడగొట్టొద్దు. అందుకే మిమ్మల్నిలా వేరే పిలిచి విషయం చెప్తున్నాను. ఆవిడ మీద కరుణ చూపండి. నేను కోరేది ఇంతే" చేతులెత్తి నమస్కారం చేసి అన్నారు.

ఆ క్షణంలో తమ ఊహకందనంత ఎత్తు ఎదిగిపోయిన తండ్రి మొహం చూడలేక తలలు దించుకుని నిశ్శబ్దంగా ఆ గదిలోంచి వెళ్ళిపోయారు ఇద్దరూ.

COMMENTS